క్లుప్తంగా

వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలోని సంత సీతారాంపురం సైకి వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఎన్ఎస్ఎస్ శిబిరం కె.కె.నాయుడు పేటలో కొనసాగుతోంది. గ్రామంలో మంగళవారం శ్రీకాకుళం రూరల్ మండలం రాగోలుకు చెందిన జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించి, ప్రజలకు వైద్య సేవలు అందజేశారు. రోగులకు ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, సైకి కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టిపెట్టాలి

ఎచ్చెర్ల క్యాంపస్: రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం ఎస్ఎంపురం క్యాంపస్‌లో మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు సూచించారు. మండలంలోని బంటుపల్లిలో క్యాంపు కార్యాలయంలో డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకట గోపాల ధనబాలాజీ, పరిపాలన అధికారి మునిరామకృష్ణతో మంగళవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వసతులు, విద్యా ప్రమాణాలపై చర్చించారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం



సాయం అందిస్తున్న జామియా మసీదు కమిటీ సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని గోల్కొండ రేవువీధిలో నివాసముంటున్న పేద ముస్లిం మహిళ ఫాతిమా బేగం ఇల్లు అగ్ని ప్రమాదంలో కాలిపోయింది. దీంతో సర్వం కోల్పోయిన ఆమెకు జామియా మసీదు ప్రతినిధులు మంగళవారం సాయం అందించారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగింది. కార్యక్రమంలో జామియా మసీదు ప్రెసిడెంట్ ఖాన్, వైస్ ప్రెసిడెంట్ హాజీ భయ్యా, కార్యదర్శి అక్బర్ భాష తదితరులు పాల్గొన్నారు.

జూద శిబిరంపై దాడి

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా కేంద్రంలోని ఆదివారంపేట వద్ద ఓ నివాస గృహం ఆరు బయట జూదం ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను రెండో పట్టణ పోలీసులు అదుపులో తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.9,60,080 నగదు, మూడు ద్విచక్ర వాహనాలు 6 మొబైల్ ఫోన్‌లు స్వాధీన పరచుకున్నట్లు తెలిపారు. బలగ మెట్టు కూడలిలో ఓ పాన్ షాప్ నడుపుతున్న మహిళ 21 మద్యం బాటిళ్లతో పట్టుబడిందని తెలిపారు. ఈమె గతంలో కూడా పట్టుబడడంతో కేసు నమోదు చేసి 14 రోజులు రిమాండ్కు తరలించామని తెలిపారు

విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలి



మాట్లాడుతున్న డాక్టర్ దానేటి శ్రీధర్

శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలని వైద్యుడు, జనసేన నాయకుడు డాక్టర్ దానేటి శ్రీధర్ అన్నారు. నగరంలోని 80 అడుగుల రోడ్డులో ఉన్న బృందావన్ ఫంక్షన్ హాల్‌లో కాకినాడ ఆదిత్య జూనియర్ కళాశాల రేజోస్-2.0 సక్సెస్ మీట్ వేడుకలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఆర్ఐవో ప్రగడ దుర్గారావు మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో విద్యార్థులు రాణించాలంటే క్రమశిక్షణ, నైపుణ్యం పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సంపతి రావు జ్యోతిప్రకాష్, బాయ్స్ కాలేజీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గణపతి వెంకటేశ్వరరావు, కాకినాడ ఆదిత్య విద్యాసంస్థల జిల్లా డైరెక్టర్ బీఎస్ చక్రవర్తి, సీఏవో రామారావు, కాకినాడ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.ఢిల్లీశ్వరరావు, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్ కె.శివశంకర్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

27న వాలీబాల్ జట్ల ఎంపికలు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఏపీ రాష్ట్రస్థాయి సీనియర్స్ వాలీబాల్ జట్ల ఎంపిక పోటీలు ఈనెల 27వ తేదీన విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వేదికగా జరగనున్నాయని జిల్లా క్రీడాధికారి డాక్టర్ కె.శ్రీధర్ రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ (శాప్) ఆధ్వర్యంలో ఈ ఎంపిక పోటీలు జరుగుతాయన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన క్రీడాకారులు శుక్రవారం ఉదయం 7 గంటలకు తమ నేటివిటీ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, 10 పాస్ ఫొటోలతో ఎంపికలు జరిగే వేదిక వద్ద రిపోర్ట్ చేయాలని సూచించారు. జిల్లా క్రీడాకారులు మరిన్ని వివరాల కోసం 95051 33888 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

అపరాల సాగు.. లాభాలు బాగు

- పెసర, మినుము పంటలకు డిమాండ్
- ఎచ్చెర్లలో విస్తారంగా సాగు



లావేరులో సాగు చేస్తున్న మినప పంట



ఉలవల పంట

ఎచ్చెర్ల: ప్రస్తుతం వరిసాగు చేయాలంటే అన్నదాతలు అనేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వరి సాగుకు నీటి వినియోగం ఎక్కువ కావడం, తెగుళ్ల బెడద, పండిన పంటను విక్రయించేందుకు కష్టాలు తప్పడం లేదు. దీంతో అనేక మంది ప్రత్యామ్నాయ పంటలపై ఆసక్తి చూపిస్తున్నారు. ముఖ్యంగా అపరాల సాగుతో లాభాలు వస్తుండడంతో ఆదిశగా ముందుకు వెళ్తున్నారు. తక్కువ కాల పరిమితితో పెసర, మినుము సాగు చేతికి వస్తుండడంతో అపరాలను అధికంగా సాగు చేస్తున్నారు.

నియోజకవర్గంలో...

ఎచ్చెర్ల నియోజకవర్గంలోని ఎచ్చెర్ల, లావేరు, రణస్థలం, జి.సిగడాం మండలాల్లో మెట్ట ప్రాంతం ఎక్కువగా ఉండడం వలన ఈ ప్రాంతంలో అపరాల పంటల సాగు అధికంగా కనిపిస్తోంది. ఈ ఏడాది కొన్ని వేల ఎకరాల్లో అపరాల పంటలు సాగులో ఉన్నాయి. లావేరు, జి.సిగడాం ప్రాంతాల్లో పంటలు ప్రస్తుతం కోత దశకు చేరుకున్నాయి. మినప, పెసర, ఉలవ పంటలు బాగా పండడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

మార్కెట్‌లో మంచి గిరాకీ

ప్రస్తుతం మినప, పెసర పంటలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. ఎకరా సాగులో 4 నుంచి 5 క్వింటాళ్ల మినప దిగుబడి, మూడున్నర నుంచి నాలుగు క్వింటాళ్ల పెసర దిగుబడి ఉంది. క్వింటా పెసలు మార్కెట్‌లో రూ.8 వేలు పలుకుతుండగా, మినుములు క్వింటా ధర రూ.7,500 నుంచి రూ.8 వేలు మధ్య ధర పలుకుతోంది. స్థానికంగా మిల్లర్లు, దళారులు ఈ పంటలను హాట్ కేకుల్లా కొనుగోలు చేస్తున్నారు. రైతుల వద్ద పెద్ద ఎత్తున దళారులు కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. పెద్దగా పెట్టుబడి లేకుండా ఈ పంట చేతికందుతుండటంతో రైతులకు మంచి ఆదాయం కలిసివస్తోంది.

పంట బాగుంది



ఈ ఏడాది రబీ సీజన్‌లో సాగు చేసిన మినప పంట చాలా బాగుంది. ప్రస్తుతం పంట కోత దశలో ఉంది. నూర్పిడి అనంతరం కల్లాల్లోనే పంటను వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. స్థానికంగానే విక్రయాలు జరుగుతున్నాయి. ఎకరా సాగులో నాలుగు క్వింటాళ్లకు పైగా దిగుబడి వస్తోంది.

– పిన్నింటి రాములు, మురపాక, లావేరు మండలం

మంచి ధర పలుకుతోంది



ఈ ఏడాది మినప, పెసరలకు మంచి ధర పలుకుతోంది. వర్షాలు అనుకూలించడం, మంచు పెద్దగా లేకపోవడంతో అపరాల సాగు బాగుంది. దీంతో మంచి దిగుబడులు వస్తా యని ఆశిస్తున్నాం. ఖాళీగా ఉన్న మెట్ట ప్రాంతాల్లో వేసిన పంటలు కోతదశకు చేరుకోగా, వరిపంట కోత మడుల్లో వేసిన పంటలు పూత దశకు చేరుకున్నాయి.

– కె.రాము, చిలకపాలేం, ఎచ్చెర్ల మండలం

విద్యుత్ భారం దుర్మార్గపు చర్య

- ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్



పోస్టర్ అవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్ కుమార్ తదితరులు

రణస్థలం: విద్యుత్ చార్జీలు పెంచమని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం, ప్రస్తుతం సామాన్య ప్రజలు, రైతులపై భారీగా విద్యుత్ భారం వేయడం దుర్మార్గపు చర్య అని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కరెంట్ చార్జీల బాదుడుపై ఈనెల 27వ తేదీన చేపట్టనున్న వైఎస్సార్‌సీపీ పోరుబాట పోస్టర్‌ను మంగళవారం అవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ వినియోగదారులపై మోపిన రూ.15,485.36 కోట్ల చార్జీల బాదుడును వెనక్కి తీసుకోవాలని, ఎన్నికల హామీలో ఇచ్చినవిధంగా చార్జీల పెంపును నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కాయల రమణ, రొక్కం బాలకృష్ణ, మీసాల వెంకటరమణ, బల్లాడ జనార్దన్‌రెడ్డి, దన్నాన రాజీనాయుడు, గొర్లె అప్పలనాయుడు, సనపల నారాయణరావు, గొర్లె అప్పలనర్సునాయుడు, రాయపురెడ్డి భుజంగరావు, నేతింటి నీలమప్పుడు, ముద్దాడ శంకర్, బెందు రామారావు, మీసాల రాంబాబు, డోల వెంకటరమణ, బోర సాయిరామ్, గోవిందరెడ్డి, మీసాల శ్రీనివాసరావు, దేశెట్టి తిరుపతిరావు, చిత్ర మోహన్‌రావు, శివకుమార్, వాళ్లె దాలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

నాన్ టీచింగ్ స్టాఫ్‌కు పదోన్నతులు సరికాదు

శ్రీకాకుళం న్యూకాలనీ: బోధన రంగంలో కనీస అవగాహన లేని నాన్ టీచింగ్ స్టాఫ్‌కు గెజిటెడ్ హోదా కలిగిన జూనియర్ లెక్చరర్ పోస్టులను కట్టబెట్టడం సరికాదని ఫోర్టో (ఫోర్ ఆఫ్ రిజిస్టర్డ్ టీచర్స్ ఆర్గనైజేషన్) సంఘ రాష్ట్ర ప్రతినిధులు బలివాడ ధనుంజయరావు, బృందావన్, జిల్లా ఫోర్టో చైర్మన్ పిసిని వసంతరావు, ప్రధాన కార్యదర్శి బి.రాజేష్, మీడియా కన్వీనర్ బోనెల రమేష్‌లు అన్నారు. ఈ మేరకు మంగళవారం సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్‌సీటీఈ నిబంధనలకు విరుద్ధంగా సర్వీసులో ఒక్కసారి కూడా పాఠాలు చెప్పని నాన్ టీచింగ్ సిబ్బందికి గెజిటెడ్ హోదా కలిగిన జూనియర్ లెక్చరర్స్ పోస్టులను పదోన్నతుల పేరిట కట్టబెట్టడం దారుణమన్నారు. కేవలం ఒక జీవోను అడ్డంపెట్టుకుని ఈవిధంగా విద్యావ్యవస్థను అస్తవ్యస్తం చేస్తుండటం ఎంతమాత్రం తగదని ఆరోపించారు. ఇలాంటి చర్యల ద్వారా ప్రభుత్వంపై, ప్రభుత్వ జూనియర్ కళాశాలలపై చిన్నచూపు, అపనమ్మకం కలుగుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అర్హత కలిగిన స్కూల్ అసిస్టెంట్లు వేలాది మంది ఉన్నప్పటికీ.. వారిని పదోన్నతి ద్వారా జూనియర్ కళాశాలకు తీసుకోకుండా చేస్తుండడం విచారకరమన్నారు.

ఐదుగురిపై కేసు నమోదు



ఫరీదుపేటలో బాధితుల నుంచి వివరాలు సేకరిస్తున్న ఎస్ఐ సందీప్ కుమార్

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలోని ఫరీదుపేటలో తమ ఇంటిపై ఐదుగురు వ్యక్తులు దాడి చేసినట్లు పైడి రాజశేఖర్ అనే వ్యక్తి మంగళవారం ఫిర్యాదు చేయడంతో పోలీసులు వారిపై కేసు నమోదు చేశారు. ఈ ఫిర్యాదులో తమ ఇంటిపై ఇబ్రహింబాద్ గ్రామానికి చెందిన సనపల వెంకటరమణ, రామారావు, రమణ, నారాయణరావు, కిల్లి నారాయణరావుతో కూడిన బృందం దాడి చేశారని పేర్కొన్నారు. రాజశేఖర్‌కు ఇబ్రహింబాద్‌కు చెందిన లక్ష్మితో కొన్నేళ్ల క్రితం వివాహం జరగ్గా, ప్రస్తుతం భార్యాభర్తల మనస్పర్థలు నేపథ్యంలో పెద్దల మధ్య చర్చలు జరుగుతున్నాయి. కాగా అమ్మాయి కుటుంబ సభ్యులతో కలిసి కొందరు తన ఇంటిపై దాడికి వచ్చి, కుటుంబ సభ్యులను గాయపరిచారని పోలీసులకు ఫోన్‌లో సమాచారం ఇచ్చాడు. ఎస్ఐ వి.సందీప్‌కుమార్ బాధితుల నుంచి ఫిర్యాదు స్వీకరించి శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. పక్క గ్రామానికి చెందిన వ్యక్తులు ఒక్కసారిగా బైకులు, ఆటోల్లో వచ్చి దాడి చేయడం చర్చనీయాంశంగా మారింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

నలుగురిపై గృహ హింస కేసు

అదేవిధంగా ఇబ్రహింబాద్ గ్రామానికి చెందిన సనపల లక్ష్మి మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎచ్చెర్ల పోలీసులు నలుగురిపై గృహ హింస కేసు నమోదు చేశారు. భర్త పైడి రాజశేఖర్, మరిది మనోజ్‌కుమార్, అత్తామామలు పోలినాయుడు, రమణమ్మలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సందీప్‌కుమార్ తెలిపారు.

స్వీయ రక్షణపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ప్రసన్న లక్ష్మి, హెచ్ఎం జయలక్ష్మి

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆడపిల్లలు స్వీయ రక్షణపై అప్రమత్తంగా ఉండాలని వన్‌స్టాప్ సెంటర్ కేస్ వర్కర్ ప్రసన్నలక్ష్మి సూచించారు. ఆడపిల్లలని రక్షిద్దాం, ఆడపిల్లలని చదవనిద్దాం అనే నినాదంతో సంతసీతారాంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వన్ స్టాప్ సెంటర్ల ద్వారా విద్యార్థినులకు చట్టాలపై మంగళవారం అవగాహన కల్పించారు. మహిళలకు ఎటువంటి ఇబ్బంది కలిగినా 100, 1098, 181, 112 హెల్ప్‌లైన్ నంబర్లకు వెంటనే సమాచారం అందించాలని సూచించారు. మహిళలకు ఆపన్నహస్తంగా వన్‌స్టాప్ సెంటర్లు ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం జయలక్ష్మి, అన్నెపు రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

చైన్ స్నాచింగ్‌కు యత్నం

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని పాత్రునివలస గ్రామంలో సోమవారం సాయంత్రం గుర్తు తెలియని ముగ్గురు దుండగులు బాణాల చిన్నమ్మడు అనే మహిళ మెడలో చైన్ స్నాచింగ్‌కు యత్నించారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. టిడ్కో కాలనీలో సమీపం నుంచి పాత్రునివలస గ్రామంలోని పాన్‌షాపులకు చిన్నపాటి రహదారి మీదుగా రాకపోకలు చేస్తుంటారు. అదే మాదిరిగా ముగ్గురు వ్యక్తులు పల్సర్ బైక్‌పై వచ్చి ఒక నిర్మానుష్య ప్రాంతంలో వేచి ఉన్నారు. ఇంతలో ఒక మహిళ అటువైపుగా వెళ్తుండగా ఒక దుండగుడు వచ్చి తాగడానికి మంచినీరు కావాలంటూ అడిగాడు. అయితే తన ఇల్లు ఇక్కడ కాదని లోపలికి ఉందని చెప్పడంతో, ఒక్కసారిగా ఆ మహిళ మెడపై అమాంతంగా చైన్ తెంపడానికి ప్రయత్నించాడు. దీంతో ఆమె ఒక్కసారిగా ప్రతిఘటించి దొంగ, దొంగని కేకలు వేయడంతో అక్కడినుంచి బైక్‌పై ముగ్గురు పారిపోయారు. ఈ ఘటన పాత్రునివలస గ్రామంలో హాట్ టాపిక్‌గా నిలిచింది. మహిళ మెడలోంచి వస్తువులు ఏమీ చోరీకి గురవ్వకపోవడంతో ఆమె ఎటువంటి ఫిర్యాదు చేయలేదు.

తొలగించేదెన్నడో..?



శ్రీకాకుళం నగరంలోని రిమ్స్ ఆస్పత్రి రోడ్డులో కల్వర్టుపై పలకలు వేసి చాలా రోజులయ్యింది. కానీ పనులు పూర్తయినా తీసుకొచ్చిన సామగ్రి తొలగించకుండా వదిలేయడంతో ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యం వలన ఈ రోడ్డులో ప్రతిరోజూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఒకే రోడ్డులో రాకపోకలు సాగించడంతో తరచూ ఇబ్బందులు పడాల్సి వస్తోందని ప్రయాణికులు చెబుతున్నారు. రిమ్స్ ఆస్పత్రికి వచ్చే రోగులు, అంబులెన్స్‌లో వేగంగా వెళ్లడంతో ప్రమాదాలకు గురవుతున్నామని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా నగరపాలక ఇంజినీరింగ్ అధికారులు చొరవచూపి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

– శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)

విస్తృతంగా తనిఖీలు



గారలోని పలు దుకాణాల్లో గంజాయి నిల్వలపై మంగళవారం పోలీసులు తనిఖీలు చేశారు. శిక్షణ పొందిన కెనాన్ జాగిలంతో పాటు ఏఆర్ హెడ్‌క్వార్టర్స్ సిబ్బంది ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. వాసన ద్వారా పసిగట్టేలా గంజాయిని గుర్తించేలా ఈ కెనాన్‌కు శిక్షణ ఇచ్చారు. గంజాయి అమ్మకం చేసినా, నిల్వ ఉంచినా కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ ఆర్.జనార్ధనరావు హెచ్చరించారు.

– గార


వర్షపు నీరు నిల్వ



పొన్నాడ ఎస్సీ కాలనీలో రోడ్డుపై నీరు నిలిచిపోతోంది. చిన్నపాటి వర్షం పడినా స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం, రోడ్డు అధ్వానంగా మారడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. అందువలన డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. మరో పక్క జంగిల్ క్లియరెన్స్ చేపట్టకపోవడంతో పిచ్చిమొక్కలు వ్యాపించి ఉన్నాయి

– ఎచ్చెర్ల క్యాంపస్

లాంగ్ పెండింగ్ కేసులపై దృష్టి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వర రెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ : అపరిష్కృతంగా ఉన్న లాంగ్ పెండింగ్ కేసులపై అధికారులు పూర్తిస్థాయిలో దృష్టిపెట్టాలని, ప్రాపర్టీ కేసులు ఛేదించాలని, గంజాయిని అరికట్టాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ నెలవారీ నేర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాపర్టీ కేసుల్లో త్వరితగతిన చార్జిషీటు దాఖలు చేసి బాధితులకు న్యాయం చేయాలని, గ్రీవెన్స్‌లో స్వీకరించిన ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇవ్వాలని, గ్రామాల్లో తగాదాలు నేరాలు జరగకుండా చూడాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో దొరికిన వ్యక్తుల డ్రైవింగ్ లైసెన్సులు సీజ్ చేయాలని, ఎన్‌ఫోర్సుమెంట్ వర్క్‌పై దృష్టి కేంద్రీకరించి పేకాట శిబిరాలు, బెల్టుషాపులపై చర్యలు తీసుకోవాలన్నారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పించాలని, సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపై అప్రమత్తంగా ఉండేలా చూడాలన్నారు. రాత్రివేళల్లో గస్తీ విధుల్లో అప్రమత్తంగా తిరుగుతూ పాత నేరస్తులను గుర్తించాలని, ఉదయం, సాయంత్రం, రద్దీప్రదేశాలు, మార్కెట్లు, బ్యాంకులు, కళాశాలల వద్ద విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ కేవీ రమణ, డీఎస్పీలు వివేకానంద, మూర్తిలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

జిల్లాలో ఉద్యోగ విప్లవం సృష్టించాలి



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

శ్రీకాకుళం: జిల్లాలో వేలాది మందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేలా పరిశ్రమలు, పారిశ్రామిక వేత్తలతో ఉద్యోగ విప్లవానికి నాంది పలకాలని, ఇందుకోసం ఇన్వెస్ట్ ఇన్ శ్రీకాకుళం పేరిట త్వరలో పారిశ్రామిక వేత్తలతో సదస్సు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో జిల్లా నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పన సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లాలో కొత్తగా పరిశ్రమలు, ఉపాధి కేంద్రాల ఏర్పాటు ద్వారా వలసలకు శాశ్వత పరిష్కారం చూపగలమన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక బుక్‌లెట్‌ను అవిష్కరించారు. కార్యక్రమంలో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్, ఎమ్మెల్యే గొండు శంకర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

జి.సిగడాం: మండలంలోని వాండ్రంగి పంచాయతీ పాతబస్టాండ్ సమీపంలో మంగళవారం పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. అక్కడ రూ.1,39,180లు, 15 సెల్‌ఫోన్లు, 2 కార్లు, 11 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ వై.మధుసూదనరావు తెలిపారు.

క్రిస్మస్ సందడి

జిల్లావ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలకు చర్చిలు సన్నద్ధమయ్యాయి. అలాగే ముందస్తు క్రిస్మస్ వేడుకలు మంగళవారం వివిధ చోట్ల ఘనంగా జరిగాయి. పాఠశాలలు, చర్చిల్లో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. క్రిస్మస్ ప్రాధాన్యతను పిల్లలకు తెలియజేశారు. చర్చిలను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు.

– సాక్షి నెట్‌వర్క్



శ్రీకాకుళం కల్చరల్: కరుణా సమాజంలో కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



శ్రీకాకుళం కల్చరల్: క్రిస్టియన్ వర్షిప్ కేంద్రంలో గీతాలు పాడుతున్న చిన్నారులు



శ్రీకాకుళం కల్చరల్: విద్యుత్ వెలుగుల్లో కీస్టోన్ చర్చి



రణస్థలం: పాతర్లపల్లి చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు



గార: విద్యుత్ వెలుగుల్లో ఏసుక్రీస్తు మహిమ మందిరం



శ్రీకాకుళం న్యూకాలనీ: శర్వాణీలో క్రిస్మస్ వేడుకలు



శ్రీకాకుళం కల్చరల్: చిన్నబజారు బాప్టిస్ట్ చర్చిలో గీతాలాపన చేస్తున్న దృశ్యం